## క్లుప్తంగా

### పొదుపు చేసి ఆర్థికంగా ఎదగాలి

కుంటాల: స్వయం సహాయక సంఘాల మహిళలు పొదుపు చేసి ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. మంగళవారం కుంటాల స్త్రీ శక్తి భవనంలో మండల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో మండల సమైక్య అధ్యక్షురాలు భ్యాగరి లక్ష్మి, మండల సమైక్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### బస్టాండ్‌లో క్రిస్మస్ సంబరాలు



వేడుకల్లో డిపో మేనేజర్, సిబ్బంది

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో శాంతక్లాజ్ వేషధారణలతో కేక్ కట్ చేయించారు. ప్రయాణికులకు చాక్లెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ ఏ.ఆర్.రెడ్డి, కంట్రోలర్లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

### 27న దుకాణాలకు వేలం

దిలావర్‌పూర్: మండలంలోని శ్రీ మతాన్నపూర్ణ కదలి పాపహరేశ్వరాలయ ప్రాంగణంలో దుకాణ సముదాయాలకు ఈనెల 27న వేలంపాట నిర్వహించనున్నట్లు ఈవో భూమయ్య పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో జనవరి నుంచి ఏడాదిపాటు కొబ్బరికాయలు, పూజ సామగ్రి, తినుబండారాలు విక్రయించేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కల్గినవారు రెండు దుకాణాలకు రూ.50 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. జూనియర్ అసిస్టెంట్ జాదవ్ మాధవరావు, అర్చకులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

కుంటాల: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీవో సుదర్శన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు, కుంటాల గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శులు రాజబాపు, భోజన్న తదితరులు ఉన్నారు.

### ఉపాధి గ్రామసభ

తానూరు: మండలంలోని వాడవన గ్రామంలో మంగళవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కూలీలు చేసిన ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఖర్చు వివరాలు, జరిగిన పనులను బృందం సభ్యులు కూలీలకు చదివి వినిపించారు. కార్యక్రమంలో డీఆర్పీ రాజాబాబు, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, టీఏ ప్రసాద్, కార్యదర్శి కరుణ తదితరులు ఉన్నారు.

### నర్సరీ పరిశీలన

తానూరు: మండలంలోని ఖర్బాలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని మంగళవారం ఈజీఎస్ ఏపీవో గంగాధర్ పరిశీలించారు. నర్సరీలో విత్తనాలు నాటించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. పల్లె ప్రకృతివనంలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. టీఏ ప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

### తిరుప్పావై ప్రవచనాలు

నిర్మల్‌టౌన్: ధనుర్మాసం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవరకోట దేవస్థానంలో మంగళవారం తిరుప్పావై ప్రవచనాలు చెప్పారు. ఈ ప్రవచనాలను దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో టీటీడీ ప్రవచకులు రామకన్నన్ నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు నవీన్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ అందజేత

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని వాసవి పాఠశాల యాజమాన్యం పదోతరగతి చదువుతున్న పేద విద్యార్థుల కోసం ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను లయన్స్ క్లబ్ సభ్యులకు అందించారు. మంగళవారం పాఠశాలల ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సెక్రెటరీ జగదీశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజాయిసన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న చైర్మన్ దంపతులు

కడెం: మండలంలోని మాసాయిపేట్‌లో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం దేవతామూర్తులకు కుంకుమపూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకుడు రితేశ్ రాథోడ్, మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ దినకర్‌రెడ్డి పూజలు చేశారు.

# కెవ్వు కేక్



నిర్మల్‌ఖిల్లా: ప్రజల జీవనశైలికి అనుగుణంగా వ్యాపార ధోరణి కూడా మారుతోంది. ప్రజలు తమ అభిరుచికి ప్రాధాన్యమిస్తూ నామకరణమైనా, పుట్టినరోజైనా, పెళ్లయినా, పెళ్లి రోజైనా, పండగ, పబ్బం ఏదైనా.. కేకులను వేడుకల్లో భాగం చేసుకుంటున్నారు. జిల్లాకేంద్రంలోని బేకరీల నిర్వాహకులు వివిధ డిజైన్లలో కేకులు తయారు చేస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. క్రిస్మస్, న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో డిజైన్ల కేకులపై 'సాక్షి'కథనం.

- క్రిస్మస్, న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో పెరిగిన ఆర్డర్లు
- జిల్లాకేంద్రంలో ఆకట్టుకుంటున్న డిజైన్లు

**వేడుక ఏదైనా ..**

పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం, పండగలు, న్యూఇయర్ వేడుకలకు కేకు తప్పనిసరి అయింది. యువత సైతం ఖర్చుకు వెనుకాడటం లేదు. వీరి ఆసక్తిని అవకాశంగా మల్చుకుంటున్న బేకరీల నిర్వాహకులు తీరొక్క డిజైన్లలో కేకులను మార్కెట్‌లో అందుబాటులో ఉంచుతూ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. చిన్నారుల కోసం కార్టూన్ బొమ్మలున్న కేకులు, ఎగ్‌లెస్ కేకులు, చాక్లెట్ కేకులను అందిస్తున్నారు. మరోవైపు తల్లిదండ్రులు తమ పిల్లల జన్మదిన వేడుకలు, నూతన వస్త్ర అలంకరణ ఫంక్షన్లు, బార్బీ బొమ్మలకు చాక్లెట్లు, బిస్కెట్లను ఆకట్టుకునేలా అలంకరించి గిఫ్ట్‌గా ఇవ్వడం ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. ఇక రాజకీయ నాయకులు, సినీ హీరోల పుట్టినరోజులు, వారి చిత్రాల రిలీజ్ సమయంలో భారీ కేకులు ఏర్పాటు చేయడం ఫ్యాషన్‌గా మారింది.

**ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం..**

రసాయనాలు కలిసిన కేకు తినడం ద్వారా అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. కొందరు తయారీదారులు కేకుల్లో మైదాపిండితోపాటు రసాయనాలు, కృత్రిమ ఆహారంపై రంగులు చల్లి విక్రయించే పనిలో ఉంటారని.. అన్ని చూసి సురక్షితమైన కేకులనే కొనాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు సూచిస్తున్నారు. కేకుల తయారీలో మైదాపిండి, డ్రై ఫ్రూట్స్ పండ్ల రసాలు వినియోగిస్తే ఇబ్బంది లేదు. కానీ అత్యధిక గాఢత కలిగిన ఫుడ్ కలర్స్, కెమికల్స్ వినియోగించి తయారు చేసే కేకులను తింటే జీర్ణాశయ సంబంధ వ్యాధులు తలెత్తే అవకాశం ఉంటుంది.

**రంగులు చూసి మోసపోవద్దు**



"రసాయనాలు కలిసిన కేకులు తింటే అనారోగ్యం బారిన పడతాం. అన్ని తెలుసుకోవాలి. రంగులు చూసి మోసపోవద్దు. ఫుడ్‌కలర్స్, కెమికల్స్ ఉన్న వాటిని తింటే జీర్ణాశయ వ్యాధులు వస్తాయి. సాధ్యమైనంత మేరకు కెమికల్స్, కృత్రిమ ఆహార రంగులు వాడని కేకులనే వినియోగించాలి."

– డాక్టర్ రవికుమార్, ఎండీ, జనరల్ ఫిజీషియన్, నిర్మల్



నిర్మల్‌లోని ఓ బేకరీలో వివిధ డిజైన్లలో కేకులు



కేకుపై క్రిస్మస్ ట్రీలు, శాంతక్లాజ్



ఆకట్టుకుంటున్న క్రిస్మస్ కేకు

# శ్రీరాముని పాదుకల శోభాయాత్ర



పాదుకలను దర్శించుకుంటున్న భక్తులు

నిర్మల్‌టౌన్: రామరాజ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్ నుంచి ప్రారంభమైన శ్రీరాముని స్వర్ణ పాదుకల పల్లకి పాదయాత్ర మంగళవారం జిల్లాకేంద్రం చేరింది. ఈసందర్భంగా హిందూ సంఘాలు, అయ్యప్ప భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏ.ఎస్.రెడ్డి కాలనీలోని డాక్టర్ రామచంద్రారెడ్డి నివాసం నుంచి పాదుకల పల్లకి శోభాయాత్ర బోయవాడ హనుమాన్ ఆలయం వరకు సాగింది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా యాత్ర నిర్వాహకులు సురేశ్‌జోషి మాట్లాడుతూ ప్రజల్లో దైవభక్తి, దేశభక్తి పెంచేందుకే రాముని పాదుకలతో పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈనెల 30న శ్రీరామ పాదుకలు అయోధ్యకు చేరుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# వరికొయ్యలను కలియదున్నాలి



వీసీలో పాల్గొన్న డీఏవో అంజిప్రసాద్, రైతులు

లక్ష్మణచాంద: వరికొయ్యలు, పంట అవశేషాలను తగులబెట్టకుండా భూమిలోనే కలియదున్నడం ద్వారా భూమికి అదనపు పోషకాలు అంది సారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంట అవశేషాలను తగులబెడితే కలిగే నష్టాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరించగా లక్ష్మణచాంద రైతు వేదిక నుంచి డీఏవో, రైతులు పాల్గొన్నారు. పొలంలోని వరికొయ్యలకు నిప్పుపెట్టడం ద్వారా భూమిలోని పోషకాలు నశించి భూసారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు పవిత్ర, సుశ్మిత, రైతులు పాల్గొన్నారు.

### క్రికెట్ పోటీలు ప్రారంభం

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో మంగళవారం సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ ప్రారంభించారు. మండలంలోని 13 గ్రామాల నుంచి జట్లు టోర్నీలో తలపడనున్నాయి. విజేతగా నిలిచిన జట్టుకు రూ.16వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు, మూడో బహుమతి రూ.5 వేలు నగదుతోపాటు ట్రోఫీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై సాయికిరణ్, ఆర్ఐ వేణుగోపాల్, ఫౌండేషన్ నిర్వాహకులు సాహెబ్‌రావు, సీఈఓ అనిల్, పీఆర్ఓ క్రాంతికుమార్, నిర్వాహకులు భూమారెడ్డి, వాజిద్, సాజిద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# యూటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన పెంట అశోక్, దాసరి శంకర్

నిర్మల్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీని మంగళవారం జిల్లాకేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దాసరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా పెంట అశోక్, ఉపాధ్యక్షులుగా మనోహర్‌రెడ్డి, సుజాత, కోశాధికారిగా నాగయ్య, కార్యదర్శులుగా రాజేశ్వర్, ఫాసిల్, రమేశ్, మురళి, గంగాధర్, జాదవ్ రాజేందర్, గట్టు శ్రీనివాస్, శివరాజ్, పత్రిక కన్వీనర్‌గా మారపాక భీమయ్య, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా గోవర్ధన్, గురుకుల కన్వీనర్‌గా అనిల్, అకాడమిక్ కన్వీనర్‌గా లక్ష్మణ్, సంస్కృత కమిటీ కన్వీనర్‌గా అంబటి నారాయణ, సోషల్ మీడియా కన్వీనర్‌గా వీరేశం, క్రీడా కమిటీ కన్వీనర్‌గా రాజేశ్వర్, స్టడీ సర్కిల్ కన్వీనర్‌గా యు.రాజేశ్వర్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శులు వెంకట్, సత్యానంద్, రమేశ్ వ్యవహరించారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామ ఫంక్షన్ హాల్‌లో కడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09 పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు కట్ట రాజమౌళి, కుమారస్వామి, నగేశ్, కిషన్‌ను శాలువతో సన్మానించారు. ఇందులో పలువురు పూర్వవిద్యార్థులు షేక్ జాఫర్, స్వామి, శ్రావణ్, సురేశ్, అంజన్న, శ్రీరాం, నాగరాజు తదితరులు ఉన్నారు.

# 'మధ్యాహ్న' కార్మికుల నిరసన



తానూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

తానూరు: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు తానూరులో రహదారిపై ధర్నా చేశారు. పెండింగ్‌లో బిల్లులు చెల్లించి నెలకు గౌరవ వేతనం రూ.10 వేలు అందించాలని కోరారు. అనంతరం సంతలో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు గంగాధర్, సావిత్రిబాయి, గంగాధర్, రేణుకబాయి, గోదావరిబాయి, లాలు, భరత్‌బాయి ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవానం నాలుగో రోజుకు చేరింది. జగన్నాథ్‌రావు చౌరస్తాలో ర్యాలీ తీసి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మి, పద్మ, విజయ, నారాయణ, నర్సవ్వ, భాను పాల్గొన్నారు.

# నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

భైంసాటౌన్: నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సారెస్పీ పునరావాస గ్రామస్తులు.. ఇళ్ల స్థలాలకు పట్టాలు లేక ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారని వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కాళేశ్వరం 28 ప్యాకేజీ పనులు, గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ కెనాల్ సీసీ లైనింగ్, గుండెగాం పునరావాసం, తహసీల్దార్ కార్యాలయాలకు సొంత భవనాలు, ఇతర అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి విన్నవించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో పలువురు బీజేపీ నాయకులు రాజేశ్‌బాబు, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: వేసవికాలంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నిర్మల్ సర్కిల్ సూపరిటెండెంట్ ఇంజినీర్ సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. గత వేసవిలో డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని నాలుగు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, 33/11 సబ్ స్టేషన్లలో ఒక పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గరిష్ట డిమాండ్ ఉన్న సమయంలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారానికి అనుగుణంగా కొత్తగా 127 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోడ్ మేరకు 38 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నట్లు వివరించారు. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు రింగ్ మెయిన్స్ వ్యవస్థను పటిష్టపరుస్తున్నామని అన్నారు. ఆసుపత్రి, మెడికల్ కాలేజీలు, పోలీస్‌స్టేషన్లకు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

# మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత



కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ముధోల్: మండల కేంద్రంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తిని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సంజీవ్‌కుమార్ తెలిపారు. మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. బ్లూకోర్టు సిబ్బంది వచ్చి అతనిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. టెక్నాలజీ సాయంతో నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రానికి చెందిన చిన్నాజీగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మంగళవారం కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి చిన్నాజీని తీసుకెళ్లారు. రెండు నెలలుగా వెతుకుతున్నా చిన్నాజీ ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు బాధిత కుటుంబీకులు పోలీసులకు వివరించారు. సిబ్బంది రామకృష్ణ, నగేశ్ ఉన్నారు.

### ఆశ్రమ పాఠశాల తనిఖీ

ఖానాపూర్: పదో తరగతి విద్యార్థులు.. ప్రణాళిక, పట్టుదలతో వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని నిర్మల్ డీటీడీవో జాదవ్ అంబాజీ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సరుకుల నిల్వ, రికార్డులు, మెనూ పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.

### ఆయిల్‌పాం సాగుతో లాభాలు

లోకేశ్వరం: రైతులు ఆయిల్‌పాం సాగు చేసి లాభాలు పొందాలని భైంసా డివిజన్ ఉద్యానశాఖ అధికారి జావిద్ పాషా అన్నారు. మంగళవారం మండలంలోని కన్కపూర్‌లో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు.

### నేడు సాగునీటి విడుదల

లక్ష్మణచాంద: సరస్వతి కాలువకు బుధవారం ఉదయం 9 గంటలకు యాసంగి పంటల సాగు కోసం నీటిని విడుదల చేయనున్నట్లు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు. పరివాహక ప్రాంతంలోకి పశువుల కాపర్లు వెళ్లొద్దని సూచించారు. మోటార్లు ఉన్న రైతులు, చేపల వేటకు పోయేవారు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని కోణార్క్ ఎన్‌బీఆర్ ఆసుపత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ షకీల్ 131 మందికి వైద్యపరీక్షలు చేశారు. కడుపులో కలిగే ఉబ్బరం వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని.. తక్షణం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కొలనోస్కోపీ, ఎండోస్కోపీ చేశారు. నిర్వాహకులు అరవింద్, సంతోష్, విజయ్, సాయి, ప్రీతం పాల్గొన్నారు.

### నేడు ఎన్నిక

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని స్వర్ణకార సంఘం కార్యాలయంలో ఈనెల 25న బుధవారం పట్టణ స్వర్ణకారుల సంఘం ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వెంకటస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు జరుగుతాయని.. సభ్యులు ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

### రోడ్డు పనులు ప్రారంభం

ముధోల్: మండలకేంద్రంలోని గాంధీచౌక్ నుంచి హనుమాన్ ఆలయం వరకు రూ.40 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జీ రావుల గంగారెడ్డి ప్రారంభించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌పతంగే, రావుల శ్రీనివాస్, అజీజ్, దిగంబర్, పోతారెడ్డి తదితరులున్నారు.

### పోలింగ్ బూత్ కమిటీ నియామకం

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ గ్రామ 80వ పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా అవర్గ సతీశ్, కార్యదర్శిగా కోటూరి నరేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వీరిని శాలువాతో సన్మానించారు. బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అరుణ్‌లాల్ నాయక్, హన్మండ్లు, సాయిబాబా, గంగాధర్, చిన్నయ్య, వినీల్ పటేల్, వెంకట్రావు పాటిల్, సాయన్న, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

### అన్ని ధ్రువపత్రాలు ఉండాలి

సారంగపూర్: వాహనచోదకులు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి దుర్గాప్రసాద్ సూచించారు. చించోలి (బీ) ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రిస్మస్ అనంతరం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురు అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరిమితికి మించి అధిక బరువు వేసుకుని వెళ్లే గూడ్స్ వాహనాలు, పరిమితికి మించి ఎక్కువ మంది ప్రయాణికులతో వెళ్లే ప్యాసింజర్ వాహనాలపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఈ మొక్కలు నాటేవారేరి..?




పచ్చదనం పెంచే ఉద్దేశంతో గత నెల 28న నిర్మల్‌లోని కోర్టు ఆవరణలో నాటేందుకు పొనికి, రాగి, మర్రి, వేప తదితర మొక్కలను భారీగా తీసుకొచ్చారు. కోర్టు అధికారులు కేవలం నాలుగైదు నాటి మిగిలిన మొక్కలను పక్కన పడేశారు. 25రోజులు గడుస్తుండటంతో సదరు మొక్కలు ఎండిపోతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



### విఠాపూర్‌కు బస్సు ప్రారంభం



బస్సు వద్ద గ్రామస్తులు

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామానికి భైంసా డిపో నుంచి మంగళవారం ఆర్టీసీ అధికారులు బస్సును ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం బస్సును గ్రామానికి రెండు ట్రిప్పులు నడపనున్నారు. అనంతరం గ్రామస్తులు డ్రైవర్, కండక్టర్‌ను సన్మానించారు. ఈసందర్భంగా గ్రామస్తులు డీఎం హరిప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు లక్ష్మీరమేశ్, దిగంబర్ పటేల్, భోజాబాయి, లింగారెడ్డి, రవి, అశోక్, అవర్గ ముత్యం, గోపాల్‌పటేల్, హనుమంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.